కానరాని స్పెషల్ ఆఫీసర్లు

- 16 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారుల నియామకం
- కార్యదర్శులతోనే నెట్టుకొస్తున్న వైనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ఉండవెల్లిలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న డీపీఓ (ఫైల్)



మెన్నిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం

ఉండవెల్లి: సర్పంచుల పదవీ కాలం ముగియడంతో వారి స్థానంలో ప్రభుత్వం గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించింది. కానీ స్పెషల్ ఆఫీసర్లు నియమించిన రెండు నెలలు మాత్రమే విధులకు హాజరై ఎంపీ ఎన్నికల పూర్తయిన నాటి నుంచి ముఖం చాటేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో కార్యదర్శులు బదిలీలు పూర్తి కావడంతో కొత్త వారికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గ్రామంపై వారికి పూర్తి అవగాహన లేకపోవడం, సరిపడా నిధులు లేకపోవడంతో సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతున్నారు.

సొంత ఖాతాల్లోకి..

గ్రామ పంచాయతీల పాలక మండళ్లు కొనసాగుతున్న సమయంలో ట్రాక్టర్ డీజిల్ ఖర్చులు, కార్మికులకు జీతాలు, మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ల కనెక్షన్లు, అనేక రకాల అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను సర్పంచ్‌ల సంతకంతో కార్యదర్శులు బ్యాంక్ ఖాతాల నుంచి డ్రా చేసేవారు. ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్ లేకుండానే నిధులు డ్రా చేస్తుండడంతో దుర్వినియోగం అవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఎంపీడీఓలకు సమాచారం ఉన్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. మేజర్ పంచాయతీల్లో రూ.లక్షల్లో నిధులు డ్రా చేసి ఒక పనిని రెండుసార్లుగా రికార్డులో నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొన్నింటిలో పరిస్థితి భిన్నం

సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తై 8 నెలలు పూర్తైనా ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవట్లేదు. దీంతో చిన్న పంచాయతీల్లో అభివృద్ధికి నిధులు సరిపోకపోవడంతో కార్యదర్శులు తమ చేతి నుంచి ఖర్చు చేస్తున్నామని వాపోతున్నారు. దీనిపై పలుమార్లు కార్యదర్శులు ప్రత్యేకాధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవట్లేదని వాపోతున్నారు.

ప్రత్యేకాధికారుల దృష్టికి..



ప్రతి గ్రామానికి ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. వారు గ్రామాల్లో పర్యటించిన సమయంలో సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటారు. దీనికి సంబంధించి వారికి దిశానిర్దేశం చేశాం.
– తిరుపతన్న, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

క్లుప్తంగా

రేపు సందరాళ్ల పోటీలు

ధరూరు: వాల్మీకి జయంతిని పురస్కరించుకొని గురువారం ధరూరులో సందరాళ్ల పోటీలు నిర్వహించనున్నట్లు వాల్మీకి సంఘం ధరూరు గ్రామ అధ్యక్షుడు బోయ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీల్లో పాల్గొనే వారికి ప్రథమ బహుమతిగా రూ.4వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ రూ.2వేలు, నాలుగో బహుమతిగా రూ. 1,500, ఐదో బహుమతిగా రూ.వెయ్యి నగదు బహుమతులను అందజేయనున్నట్లు వారు ప్రకటించారు.

నీట్‌లో తనగల విద్యార్థి ప్రతిభ



కుర్వ రఘు

శాంతినగర్: మారుమూల గ్రామంలో నిరుపేద కుటుంబంలో పుట్టిన విద్యార్థి ఇటీవల విడుదల అయిన నీట్ ఫలితాల్లో 335 ర్యాంకు సాధించి గ్రామానికి గుర్తింపు తెచ్చాడు. వడ్డేపల్లి మండలంలోని తనగలకు చెందిన కుర్వ మద్దిలేటి, శ్రీదేవి దంపతుల పెద్ద కుమారుడు రఘు ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. నీట్‌లో ఆలిండియా 28,340 ర్యాంకు రాగా.. స్టేట్‌లో 335 ర్యాంకు సాధించి మెడిసిన్ సీట్ పొందాడు. నిరుపేద విద్యార్థి ఎంబీబీఎస్ సీట్ సాధించడంతో తనగల గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేశారు. రఘు నిరుపేద కుటుంబానికి చెందినవాడు కావడంతో చదువుకు ఆర్థిక పరిస్థితి అడ్డువచ్చే అవకాశం ఉందని, ప్రభుత్వం ఆర్థికసాయం అందించి నిరుపేద విద్యార్థి డాక్టర్ కల నెరవేర్చాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో పలు రకాల అభివృద్ధి పనులను మంగళవారం మండల ప్రత్యేక అధికారి సక్రియానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెచ్చులూడిన వాటికి మరమ్మతు పనులు నాణ్యతతో చేయాలని సూచించారు. గ్రామాల్లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

తైక్వాండో విద్యార్థులకు బెల్టుల ప్రదానం



అయిజ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం తైక్వాండో విద్యార్థులకు బెల్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు కేటగిరిని బట్టి బెల్టులను తైక్వాండో జిల్లా అధ్యక్షుడు షేక్షావలి ఆచారి, జనరల్ సెక్రెటరీ శ్రీహరి చేతలు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్లు రవికుమార్, సుధీర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన



ఎర్రవల్లి: మండలంలోని బీచ్ పల్లి గ్రామంలో మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు సామాజిక అంశాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల కార్మిక వ్యవస్థ, డ్రగ్స్ నిర్మూలన, సీజనల్ వ్యాధులతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో పాటు తదితర అంశాలపై పాట, మాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు ప్రసాద్, రమాదేవి, హజరత్, స్వామి, రాహుల్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మానవపాడు: జాతీయ రహదారి–44పై ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కడప జిల్లాకు చెందిన మురళీ బైక్‌పై కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్‌కు వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్తున్నాడు. మానవపాడు మండలంలోని బోరవెల్లి స్టేజి సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని బైక్ ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న మురళి తలకు గాయాలు కాగా.. కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఏపీజే అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి



అయిజలో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మల్దకల్: ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని మంగళవారం మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన చిత్రపటానికి అధ్యాపకులు రామాంజనేయులు గౌడ్, నర్సింహులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశం కోసం ఏపీజే అబ్దుల్ కలాం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు దేవసేనారెడ్డి, తిమ్మోతి, జయరాం, రవిప్రకాష్ పాల్గొన్నారు.

అయిజ: అబ్దుల్ కలాం జయంతి వేడుకలను వివిధ పార్టీల, సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద అబ్దుల్ కలాం విగ్రహానికి అఖిలపక్ష కమిటీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తుల విధ్వంసం



ధ్వంసమైన వస్తువులను చూపుతున్న ఉపాధ్యాయులు

అయిజ: మండలంలోని బింగుదొడ్డి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పాఠశాలకు సంబంధించి వస్తువులను ధ్వంసం చేశారు. ఫ్యాన్లు, కిటికీలు, కరెంట్ బోర్డులు, విద్యుత్ బల్బులను పగులగొట్టారు. మంగళవారం వాటిని గుర్తించిన ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ రాములుదయాల్ మాట్లాడుతూ.. ఘటనపై పాఠశాల ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఇటువంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎల్వోసీ పంపిణీ

గద్వాల: మల్దకల్ మండలం విఠలాపురం గ్రామానికి చెందిన తిమ్మమ్మ అనారోగ్యంతో బాధపడుతుండడంతో మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధి నుంచి ఎల్వోసీని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అందజేశారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయం



మదనాపురం: మండలంలోని కొత్తపల్లిలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షం వచ్చిన ప్రతిసారి నీరు చేరి వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రతి రోజు ఆత్మకూరు నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి వందల సంఖ్యలో వాహనాలు ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతల్లో వర్షపు నీరు చేరడం ద్వారా ద్విచక్ర వాహనదారులను గుంతలను అంచనా వేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలు ఏర్పడి రోడ్డంతా ప్రమాదభరితంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే రోడ్డుపై పడిన గుంతలను పూడ్చివేయాలని కోరుతున్నారు.

రూ.5 లక్షల చెక్కు అందజేత

వనపర్తి రూరల్: వనపర్తి పట్టణంలోని నాగవరం గ్రామానికి చెందిన మంగలి కృష్ణయ్య విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన విద్యుత్ శాఖ నుంచి రూ.5లక్షల పరిహారాన్ని మంజూరు చేయించడంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. విద్యుత్ శాఖ ద్వారా మంజురైన రూ.5లక్షల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జయసుధ, విండో డైరెక్టర్ నాగేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉమేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి ఆలయ పునర్నిర్మాణ పూజలు



మల్దకల్‌లో హోమం చేస్తున్న అర్చకులు

మల్దకల్: మండల కేంద్రంలోని వాల్మీకి నూతన ఆలయ పునర్ ప్రతిష్ట పూజలను మంగళవారం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు రమేషాచారి, రవిచారి ఆలయంలో ప్రత్యేక హోమాలు, ప్రతిష్ఠాపన పూజలు చేపట్టారు. పూజలు తిలకించేందుకు వాల్మీకిలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది.

వాల్మీకి జయంతిని విజయవంతం చేయండి

కేటీదొడ్డి: ఈ నెల 17న నిర్వహించే వాల్మీకి జయంతి వేడుకలకు మండలంలోని అన్ని గ్రామాల్లో జయప్రదం చేయాలని కేటీదొడ్డి మండల వాల్మీకి మండల అధ్యక్షుడు టీచర్ గోవింద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది కేవలం వాల్మీకులకు మాత్రమే కాదని, రామాయణం గ్రంథ రచయిత, రాముడి ఆరాధించే అందరికీ పండుగ లాంటిదన్నారు. సమావేశంలో గబ్బుర్ వీరన్న, కొండన్న, జంగిలప్ప, కృష్ణ, తాయప్ప, నాగేష్, తదితరులు ఉన్నారు.

మాలల ఆత్మగౌరవ సభను జయప్రదం చేద్దాం



పోస్టర్లను విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

వీపనగండ్ల: మాలల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలని జిల్లా మాల ఉద్యోగుల సంఘం నాయకులు జెట్టి వెంకటస్వామి అన్నారు. ఈ నెల 27వ తేదీన నాగర్‌కర్నూల్ పట్టణంలో నిర్వహించనున్న మాలల ఆత్మగౌరవ సభకు చెందిన కరపత్రాలను మంగళవారం మండల కేంద్రంలో ఆయన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని వివిధ పార్టీల నాయకులు ప్రకటించడం మాలలకు అన్యాయం చేయడమేనని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎస్సీలకు లభిస్తున్న రాయితీల్లో మాదిగలే అధిక శాతం లబ్ధి పొందుతున్నారని వాపోయారు. మాలల హక్కుల పరిరక్షణ కోసం ఆత్మగౌరవ సభను అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రామేశ్వర్‌రావు, వీరయ్య, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, నాయకులు మోజర్ల నాగముని, చిన్న కురుమయ్య, చెన్నయ్య, కేశవులు, చిన్ని కృష్ణ, వెంకటేష్, రామస్వామి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఆంజనేయులు

వనపర్తి రూరల్: రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు మోటారు వెహికిల్ యాక్ట్ రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మోహన్ అధ్యక్షతన బొలెరో, ట్రాలీ వర్కర్స్‌తో విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. చిన్నపాటి ప్రమాదాలకు సైతం భారత న్యాయ సంహిత చట్టంలో డ్రైవర్లను దోషులుగా చిత్రీకరిస్తూ, జరిమానాలు విధిస్తున్నారని వాపోయారు. ఎలాంటి ప్రమాదం జరిగినా డ్రైవర్లను జైలుకు పంపే చట్టాలను రద్దు చేయాలని అన్నారు. అనంతరం 100 మంది కార్మికులు సీఐటీయూలో చేరారు. కార్యక్రమంలో రాములు, మోహన్, కృష్ణ, రామకృష్ణ, గంధం కృష్ణయ్య, గుంటి కరుణాకర్, బుచ్చన్న, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సమాన హక్కులు కల్పించాలి



మాచర్లలో సంఘం లీడర్లు, కూలీలను సన్మానిస్తున్న మహిళలు

గట్టు: మండలంలోని మాచర్ల గ్రామంలో మంగళవారం తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల లీడర్లు, మహిళలు గ్రామీణ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. మహిళా సంఘం లీడర్లు, కూలీలను సన్మానించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. టీవీవీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మహిళలే వెన్నెముక అని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో 70 శాతం మహిళలు అనేక పనులు చేస్తున్నప్పటికీ భూమి హక్కులు, విద్య, వైద్య సదుపాయాలు పూర్తి స్థాయిలో అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత మహిళల ఉపాధి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీవీవీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, గ్రామ సంఘం అధ్యక్షురాలు మహేశ్వరి, సంఘం లీడర్లు నర్సమ్మ, కేశమ్మ, లావణ్య, మహేశ్వరి, శృతి, జయమ్మ పాల్గొన్నారు.

రూ.51 వేల విరాళం అందజేత



వాల్మీకి నాయకులకు విరాళం అందజేస్తున్న బల్గెర హనుమంతునాయుడు

గట్టు: మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో నూతనంగా నిర్మించే వాల్మీకి ఆలయానికి బీఆర్‌ఎస్ పార్టీ నేత బల్గెర హనుమంతునాయుడు రూ.51వేల విరాళాన్ని అందజేశారు. మంగళవారం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన వాల్మీకి సంఘం నేతలు బల్గెర హనుమంతును కలిసి నూతన ఆలయ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేయడంతో ఆయన రూ.51 వేలు అందించారు. దీంతో వాల్మీకి సంఘం నేతలు దాతను అభినందించారు. కార్యక్రమంలో మోనేష్, శేఖర్‌నాయుడు, చెన్నిపాడు ఆంజనేయులు, సురేష్, శేషాద్రినాయుడు, శంకర్, తిమ్మప్ప, వెంకటేష్, తిరుమలేష్, రాజునాయుడు, భాస్కర్, శ్రీనివాసులు, గట్టన్న, బుడ్డన్న, ఆంజనేయులు, రామకృష్ణ, నరేష్, హనుమంతునాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి భారీగా తరలిరండి

శాంతినగర్: జోగుళాంబ గద్వాల జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా వాల్మీకి బిడ్డ నీలి శ్రీను ఈనెల 18న గద్వాల ప్యారడైజ్ ఫంక్షన్‌హాల్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారని, కార్యక్రమానికి జిల్లాలోని వాల్మీకిలు భారీగా తరలిరావాలని ఆసంఘం అలంపూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పైపాడు బోయ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. వాల్మీకిలను జిల్లా పదవి వరించిన సందర్భంగా పార్టీలకు అతీతంగా అందరూ కార్యక్రమానికి హాజరై వాల్మీకుల ఐక్యత చాటుకోవాలని కోరారు. జిల్లా గ్రంథాలయాల చైర్మన్‌గా ఎన్నికైన నీలి శ్రీనును ఆయన మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



నీలి శ్రీనుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పైపాడు వెంకటేశ్వర్లు

ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలి



విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్

అలంపూర్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని విశ్వశాంతి విద్యాలయాల సంస్థ కరస్పాండెంట్ మురళీధర్‌రెడ్డి అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి పాఠశాలలో చదివిన పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు, సునీత దంపతుల కుమారుడు సందీప్‌కుమార్ ఎంబీబీఎస్‌లో సూర్యపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా విద్యాలయాల సంస్థ కరస్పాండెంట్, డైరెక్టర్ మంజుల సందీప్‌కుమార్‌ను సత్కరించారు.

తహసీల్దార్‌పై యువతి ఆగ్రహం

మానవపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నారాయణపురం గ్రామానికి చెందిన హైమావతి ఓబీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోగా అలస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రిమిలేయర్ సర్టిఫికెట్ త్వరగా కావాలని ఉదయం 9గంటలకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చినా.. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఘటనకు సంబంధించి మంగళవారం సోషల్‌మీడియాలో వార్త చక్కర్లు కొడుతుంది. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. జోగుళాంబ గద్వాల జిల్లాలో సమావేశం ఉండి కార్యాలయానికి ఆలస్యంగా వచ్చామని, అనంతరం సంతకాలు పూర్తి చేసి వారిని పంపామన్నారు.

5 ఫీట్ల స్థల విషయంలో వివాదం

రాజోళి: 5 ఫీట్ల స్థలం విషయంలో ఎంపీడీఓ, ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. మండలంలోని నసనూర్ గ్రామంలో ఎండీ రషీద్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేసుకున్నాడు. ఆ ఇంటి వెనక ఉన్న స్థలం స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్‌కు చెందినది. కాగా అందులో 5 ఫీట్లు తనకు సంబంధం లేకపోయినా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆ స్థలం తనదేనని ఫీల్డ్ అసిస్టెంట్ రషీద్‌తో ఘర్షణకు దిగుతున్నాడు. ఈ క్రమంలో రషీద్ ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్‌ను సంప్రదించగా.. విచారణ చేస్తామని చెప్పారని, కానీ ఫీల్డ్ అసిస్టెంట్‌కు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. నకిలీ డాక్యుమెంట్లను ఆధారంగా చూపి 5 ఫీట్ల స్థలంపై ఫీల్డ్ అసిస్టెంట్ తనను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని రషీద్ మంగళవారం సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టాడు. ఈ విషయమై ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్‌ను వివరణ కోరగా.. ఏప్రిల్ నుంచి ఇద్దరి మధ్య గొడవ జరుగుతుందని, విచారణ చేపట్టామని, సరైన ధ్రువపత్రాలు ఉన్న వారికే న్యాయం చేస్తామని తెలిపారు. గతంలో దానికి సంబంధించి గ్రామ పంచాయతీ ద్వారా నోటీసులు కూడా పంపామని వివరించారు.

వరిధాన్యం కొనుగోళ్లపై రైతులకు అవగాహన



రైతులతో మాట్లాడుతున్న ఏఓ అరవింద్

అమరచింత: త్వరలో ఏర్పాటు చేయనున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ముందస్తుగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామని ఏఓ అరవింద్ తెలిపారు. మండలంలోని ఈర్లదిన్నెలో మంగళవారం రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. రుణమాఫీ విషయంలో రైతులకు ఉన్న సమస్యలు, ప్రస్తుత వరి పంటపై ఆశించిన సుడిదోమ, బ్యాక్టీరియా ఆకు, ఎండు తెగులు, పొట్టకుళ్లు తెగులు మొదలైన వాటిని ఎలా నివారించాలనే విషయాలను వివరించారు. అదే విధంగా వచ్చే యాసంగి నారుమడులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రస్తుత పత్తి పంట కోత తర్వాత మినుము పంట సాగు చేయడంలో మెలకువల గురించి రైతులకు అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ పథకంపై ఉండే సందేహాలను రైతులతో చర్చించామన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న ఫర్టిలైజర్ షాప్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ మల్లేష్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్: రైతులకు పంటల సాగు, సస్యరక్షణ అంశాలపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో నేరుగా మాట్లాడటం, వారి సలహాలు అందించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సాజీద్ రహమాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఏఈఓలు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు. యాసంగిలో పంటల సాగు, విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, ఎరువుల ఎంపిక, వినియోగం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. దీంతో పాటు రైతు రుణమాఫీకి సంబంధించిన సమస్యలను వ్యవసాయ అధికారులు నివృత్తి చేశారు.